
సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 18 । జూన్ । 2024


తీపి ఎక్కువైతే చేదే.. 8లో


జల'యోగం' 8లో


రైలు ప్రయాణికులకు భరోసా 'రైల్ మదద్' 8లో

న్యూస్‌రీల్

భద్రతా ప్రమాణాలకు పెద్దపీట

డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్


కోచ్‌ల వద్ద ఆర్పీఎఫ్, కమర్షియల్ సిబ్బంది తనిఖీలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో భద్రతా ప్రమాణాలను పెంచుతూ రైళ్ల సమయపాలన విషయంలో కచ్చితత్వం పాటించడమే తమ ప్రధాన లక్ష్యమని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలిపారు. ఇటీవల కాలంలో రైల్వే బోర్డు నిర్వహించిన సమీక్ష ద్వారా భారతీయ రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశాలతో దేశవ్యాప్తంగా భద్రతా, సమయపాలన విషయాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్ ద్వారా రైళ్ల రాకపోకలు, సమయపాలన, భద్రతా ప్రమాణాలు, ప్రయాణికుల సదుపాయలను సమీక్షించనున్నారు. రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్), కమర్షియల్ సిబ్బంది సంయుక్తంగా నిరంతరం తనిఖీలు నిర్వహించి మహిళా ప్రయాణికుల కోచ్‌లు, దివ్యాంగ కోచ్‌లలో సాధారణ ప్రయాణికులను అనుమతించకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు సైతం తీసుకుంటున్నట్లు తెలిపారు. మరో బృందం ప్రయాణికుల సౌకర్యాలు, వెయిటింగ్ హాల్స్, కేటరింగ్ యూనిట్స్, పార్సిల్ కార్యాలయాలు, బుకింగ్ రిజర్వేషన్ కౌంటర్స్, రైళ్ల సమయపాలన వంటి విషయాలను పరిశీలిస్తోందని చెప్పారు.

మంత్రులకు ఘన స్వాగతం


విశాఖ విమానాశ్రయం నుంచి బయలుదేరిన రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు

గోపాలపట్నం : కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి విశాఖ వచ్చిన కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడుకు విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. శ్రీకాకుళం జిల్లా నుంచి అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు అభిమానులు తరలివచ్చి పుష్పగుచ్ఛాలు, గజమాలలతో సత్కరించారు. ఇక్కడి నుంచి శ్రీకాకుళంకు భారీ ర్యాలీగా బయలుదేరారు.

ఎట్టకేలకు టాస్క్‌ఫోర్స్‌కు వాహనం కేటాయింపు

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార: నగరంలో ఎక్కడ ఏం జరిగినా టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్పందించాలి. అయితే సంఘటన స్థలానికి చేరుకోవాలంటే వారి వాహనం కండీషన్‌లో ఉండాలి. చాలా ఏళ్ల నుంచి టాస్క్‌ఫోర్స్‌కు సరైన వాహనం లేకపోవడంతో సంఘటనా స్థలానికి చేరుకోవడానికి ఇబ్బందులు పడేవారు. వీరి ఇబ్బందులపై ఇటీవల 'ఇది పోలీసు బండి' అనే కథనం 'సాక్షి'లో ప్రచురితమైంది. ఈ కథనానికి పోలీసు బాస్ స్పందించారు. టాస్క్‌ఫోర్స్ స్టేషన్‌కి మంచి కండీషన్‌లో గల వాహనాన్ని కేటాయించారు.

శభాష్ రైతన్న


బాధిత మహిళకు చైన్ అప్పగిస్తున్న రైతు బజార్ ఈవో కొండబాబు

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజార్‌లో ఓ మహిళ బంగారం చైన్ పోగొట్టుకుంది. దొండపర్తి దరి టీఎస్ఎన్ కాలనీకి చెందిన పి.కనకదుర్గాదేవి ఆదివారం ఉదయం సీతమ్మధార రైతు బజార్‌కు వచ్చింది. ఆమె మెడలోని నల్లపూసల బంగారం చైన్ తెగిపోయింది. ఏడు గ్రాముల బరువు గల చైన్ పోయిందని ఆమె రైతుబజార్ సిబ్బందికి ఫిర్యాదు చేసింది. సిబ్బంది మైకులో చైన్ పోయిందని ప్రకటించారు. కొత్తపాలేనికి చెందిన రైతు అప్పారావు తనకు దొరికిన చైన్‌ను సిబ్బందికి అందజేశారు. అనంతరం రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు బాధితురాలికి చైన్ అందజేశారు. ఆయన వెంట రైతుబజార్ అటెండర్ సతీష్, రైతులు ఇతర సిబ్బంది ఉన్నారు. గంగారం పోగొట్టుకున్న కనకదుర్గ జబర్దస్త్ ఫేం భాస్కర్ సోదరి. తనకు చైన్ అందజేసిన రైతు, బజారు సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్


వుమెన్స్ కళాశాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముస్లిం చిన్నారులు




పాతనగరం కోటవీధి గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నమాజ్ చేస్తున్న ముస్లింలు

డాబాగార్డెన్స్: నగరంలో బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. ఉదయాన్నే మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పాతనగరం కోటవీధి మైదానం, ఫెర్రీరోడ్డులో గల అంబుసరంగ్ మార్గ్, చెంగల్రావుపేటలో గల పురాతన మసీదు, డాక్టర్ డీన్ షాదీఖానా, జగదాంబ సమీపాన గల మక్కా మసీదు, అల్లిపురం, పోలీస్ బ్యారెక్స్‌లో గల రిజర్వ్‌లైన్ మసీదులో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొని నమాజ్ నిర్వహించారు. ముస్లింలతో పాటు పలువురు ప్రముఖులు నమాజ్‌లో పాల్గొన్నారు.

ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో..

పాతజైల్‌రోడ్డు విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ఎదురుగా గల సర్వీస్‌రోడ్డులో ఈదుల్ జుహ నమాజ్ నిర్వహించారు. హాజీ ఖాసీంరాజా మౌలానా నమాజ్ జరిపించారు. ఈ సందర్భంగా మౌలానా బక్రీద్ పండగ సారాంశాన్ని వివరించారు. సర్వమానవ సమానత్వం, ప్రపంచశాంతి, సౌభ్రాతృత్వం ఆకాంక్షిస్తూ ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. బక్రీద్ అంటే త్యాగానికి ప్రతీక అని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు హైదర్ అలీ షింకా, ఉపాధ్యక్షులు హాజీమీర్, అబ్బాస్ హుస్సేన్, కార్యదర్శి అమీర్‌జాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ రహ్మతుల్లా, కోశాధికారి ఎస్కే అహ్మద్‌వల్లీ, మెహబూబ్ ఆలీఖాన్, అజ్‌గర్ అలీ, మహబూబ్ షరీఫ్, మహ్మద్ అస్లం, ఎస్ఏ మునీర్ అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.




కోటవీధి గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న విదేశీయులు, వుమెన్స్ కళాశాల వద్ద నిర్వహించిన బక్రీద్ నమాజ్‌లో పాల్గొన్న ముస్లింలు

వాల్తేరు దూకుడు

- ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్‌లో అత్యధిక ఆదాయార్జన
- 2023–24లో రూ.546 కోట్ల ఆదాయంతో టాప్–1గా నిలిచిన విశాఖ
- రూ.493 కోట్లతో ద్వితీయ స్థానంలో జోన్ ప్రధాన కేంద్రం భువనేశ్వర్ స్టేషన్
- విశాఖ స్టేషన్ నుంచి 2,77,11,147 మంది ప్రయాణికుల రాకపోకలు



రాకపోకల్లోనూ పరుగులు

2023, ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024, మార్చి 31వ తేదీ వరకు విశాఖపట్నం రైల్వే స్టేషన్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్(పీఆర్ఎస్) ద్వారా 478.28 కోట్లు రాగా.. అన్‌రిజర్వ్ డ్ టికెటింగ్ సిస్టమ్(యూటీఎస్) ద్వారా రూ.67.86 కోట్లు వచ్చింది. మొత్తంగా విశాఖ రైల్వేస్టేషన్ నుంచి రూ.546.14 కోట్లు ఆదాయం లభించింది. అలాగే భువనేశ్వర్ స్టేషన్‌కు రూ.493.01 కోట్లు, ఆ తరువాత స్థానాలలో పూరీ స్టేషన్‌కు రూ.276.55 కోట్లు, బ్రహ్మపూర్ రైల్వేస్టేషన్‌కు రూ.101.94 కోట్లు ఆదాయం వచ్చింది. అదే విధంగా ప్రయాణికుల రాకపోకల విషయంలో కూడా విశాఖ స్టేషన్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక్కడి నుంచి 2,77,11,147 మంది రాకపోకలు సాగించారు. భువనేశ్వర్ స్టేషన్ ద్వారా 2,63,46,444 మంది ప్రయాణాలు చేశారు. ఇలా ఆదాయార్జనలోనే కాకుండా ప్రయాణికుల రాకపోకల విషయంలో కూడా విశాఖ సత్తా చాటుతోంది.

విశాఖ సిటీ: వాల్తేరు డివిజన్ పరుగులు పెడుతోంది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తూ.. ఆదాయంలో సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లా దూసుకుపోతోంది. తూర్పు కోస్తా రైల్వే జోన్ ప్రధాన కేంద్రం భువనేశ్వర్ స్టేషన్‌ను సైతం వెనక్కునెట్టి ఆదాయార్జనలో విశాఖ స్టేషన్ ముందుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.546.14 కోట్లు ఆర్జించింది. జోన్ ప్రధాన కేంద్రం భువనేశ్వర్ స్టేషన్ రూ.493 కోట్లతో ద్వితీయ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అలాగే ప్రయాణికులను గమస్థానాలను చేర్చడంలోను ప్రథమ స్థానంలో నిలిచింది. విశాఖ రైల్వేస్టేషన్ నుంచి 2,77,11,147 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు.

ఈస్ట్‌కోస్ట్ ఆదాయంలో సింహభాగం వాల్తేరుదే..

ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్‌కు వాల్తేరు డివిజన్ బంగారు బాతులా మారింది. అతి పెద్దదైన ఈ డివిజన్ పరిధిలో ఏటా 2.5 కోట్లకు పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. తూర్పు కోస్తా రైల్వే జోన్‌కు ఏటా సుమారు రూ.14 వేల కోట్ల వరకు ఆదాయం వస్తుండగా.. ఇందులో రూ.5 వేలు నుంచి రూ.7 వేల కోట్ల వరకు ఒక్క వాల్తేరు డివిజన్ నుంచే వస్తోంది. అతి పెద్ద లోకో షెడ్, భారీ ఎలక్ట్రికల్ లోకోషెడ్, విశాలమైన మార్షలింగ్ యార్డు కూడా ఇక్కడే ఉన్నాయి. డివిజన్ ఆదాయంలో సింహభాగం ఐరెన్ ఓర్ రవాణా జరిగే కేకే లైన్, మొదలైన ప్రధాన మార్గాల ద్వారానే వస్తుంటుంది. రైల్వేస్టేషన్ ఆధునికీకరణతో పాటు వాణిజ్య ఆదాయం పెంపుపై దృష్టి పెట్టడంతో ఆ దిశగా కూడా వాల్తేరుకు భారీగా ఆదాయం సమకూరుతోంది.

క్యాథలిక్ న్యాయవాదులకు చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పాలిమేర జయరావు, ఒంగోలు జిల్లా సెషన్స్ జడ్జి దున్న రాములు

డాబాగార్డెన్స్: తెలుగు రీజియన్ క్యాథలిక్ అడ్వకేట్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం క్యాథలిక్ న్యాయవాదులకు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాతనగరం రోజ్‌హిల్స్ వేదికగా నిర్వహించిన రెండు రోజుల అవగాహన సదస్సులో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్యాథలిక్ న్యాయవాదులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న రోమన్ క్యాథలిక్ మిషన్ విశాఖ అగ్రపీఠం పరిపాలనాధికారి, ఏలూరు బిషప్ డాక్టర్ పొలిమేర జయరావు, ఒంగోలు జిల్లా సెషన్స్ జడ్జి దున్న రాములు పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జయరావు మాట్లాడుతూ గతేడాది హైదరాబాద్‌లో అవగాహన సదస్సు నిర్వహించామని, సత్యం, న్యాయ పరిరక్షణకు ప్రతి న్యాయవాది నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. చట్టంపై అవగాహన ఉండి నమ్ముకున్న ఏసు క్రీస్తుపై విశ్వాసం ఉండాలన్నారు. న్యాయవాదులు చట్ట పరిరక్షణతోనే రాష్ట్రం, దేశం శాంతియుతంగా ఐక్యంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. అవగాహన సదస్సులో న్యాయవాదులు అడిగిన పలు ప్రశ్నలకు ఒంగోలు జిల్లా సెషన్స్ జడ్జి దున్న రాములు పలు సూచనలు చేస్తూ, చట్టపరమైన అంశాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఫాదర్ రాజు అలెక్స్, ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, ఎస్ఆర్ జెస్సీ కుర్ధాన్ వివిధ జిల్లాల నుంచి క్యాథలిక్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కథలు, కవితల పోటీలకు విశేష స్పందన

అగనంపూడి: ఉభయ తెలుగురాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన కథల, కవితల పోటీలకు విశేష స్పందన లభించిందని కంచిపాటి గురుమూర్తి స్మారక పురస్కారాల నిర్వాహకుడు, యువ రచయిత కంచిపాటి నరసింహమూర్తి తెలిపారు. గురుమూర్తి తృతీయ వర్ధంతిని పురస్కరించుకొని జాతీయ స్థాయి కథల, కవితల పోటీలు నిర్వహించగా, కథల విభాగం నుంచి వంద మంది, కవితల విభాగం నుంచి వంద మంది పాల్గొన్నట్టు పేర్కొన్నారు.

కథల విభాగంలో.. కాకినాడకు చెందిన ఎన్‌బీఎస్ శ్రీనివాస్ పొలిశెట్టి (చూపులకు నజరానా) ప్రథమ బహుమతి, విశాఖకు చెందిన వేలూరి ప్రమీలా శర్మ (వేలంపాట) ద్వితీయ బహుమతి, ఎం.సుగుణారావు (ఆదర్శవంతమైన ప్రేమకథ) తృతీయ బహుమతికి ఎంపికైనట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన నాగేంద్రనాథ్‌రావు (తల్లిచేసి మోసం), విశాఖకు చెందిన అవధానుల జగన్నాథరావు (బాలవాక్కు బ్రహ్మవాక్)కు ప్రత్యేక ప్రశంసా బహుమతులు అందివ్వనున్నట్టు పేర్కొన్నారు.

కవితల విభాగంలో.. హైదరాబాద్‌కు చెందిన మౌనశ్రీ మల్లిక్ (పరివ్రాజక పరాగం) ప్రథమ బహుమతి, కరీంనగర్‌కు చెందిన పెనుగొండ బసవేశ్వర్ (ఎడారిస్వప్నం) ద్వితీయ బహుమతి, తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురానికి చెందిన ఎం.కనకలక్ష్మి (వృద్ధాశ్రమం) తృతీయ బహుమతికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 22న అగనంపూడి సీడబ్ల్యూసీలో నిర్వహించనున్న కార్యక్రమంలో విజేతలకు పారితోషికం, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం


సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

మహారాణిపేట: గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం సర్క్యూట్ హౌస్‌లో పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విశాఖలో శాంతి భద్రతలు, గంజాయి రవాణా, మాదక ద్రవ్యాల సరఫరా, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. గంజాయి రవాణా చేస్తే ఎవరినైనా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. అమెజాన్‌లో కూడా గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. కర్రీ లీప్స్ పేరుతో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, వీటిపై పోలీసులు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, నగర పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, అదనపు పోలీసు కమిషనర్ ఫకీరప్ప, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'నారాయణ' ఆక్రమణలపై నిగ్గు తేల్చండి


తాళ్లవలస నారాయణ విద్యాసంస్థల ప్రహరీ బయట నిర్మించిన షెడ్లు

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ పరిధిలో నారాయణ విద్యాసంస్థలను ఆనుకుని ప్రభుత్వ గెడ్డ స్థలం ఆక్రమణకు గురైందని దీనిపై రెవెన్యూ అధికారులు నిగ్గు తేల్చాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. గతంలో నారాయణ విద్యాసంస్థలకు చెందిన స్థలంలో భవనాలు నిర్మించుకుని చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఇటీవల కాలంలో గొల్లల తాళ్లవలస మామిడితోట వైపు ప్రహరీ బయట సర్వే నంబర్ 168లో ప్రభుత్వానికి చెందిన వాయిలగెడ్డ పరిసరాలను ఆక్రమించి వరుసగా షెడ్లు నిర్మించారని ఆరోపించారు. ఈ స్థలం 1500 గజాల వరకు ఉంటుందన్నారు. దీని మార్కెట్ విలువ రూ.2 కోట్ల పైమాటే ఉంటుందని తెలిపారు. భీమిలి కొండపై కురిసిన వర్షం ఈ గెడ్డ ద్వారా ప్రవహిస్తుందని చెప్పారు. ఇటీవల గత ప్రభుత్వ రీసర్వే సమయంలోనే ప్రభుత్వ గెడ్డ స్థలం ఆక్రమణకు గురయినట్టు భీమిలి రెవెన్యూ అధికారులు గుర్తించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ మేరకు మంగళవారం మరోసారి సర్వే చేసి తహసీల్దార్‌కు నివేదిక ఇవ్వనున్నట్టు వీఆర్ఓ తెలిపారు.

ప్లీజ్ మీరెవరూ రాయవద్దు

ప్రభుత్వ స్థలాన్ని నారాయణ విద్యాసంస్థలు ఆక్రమించిన వైనంపై 'అప్పుడే మొదలెట్టేశారు' శీర్షికతో సోమవారం 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు తాళ్లవలస టీడీపీ నాయకులు భుజాలు తడుముకున్నారు. నారాయణ కళాశాల టీడీపీకి చెందినది కావడంతో ఆ నేతలు ఉలిక్కిపడుతున్నారు. మీడియా ప్రతినిధులకు ఫోన్ చేసి ఆరా తీయడం మొదలుపెట్టారు. ప్లీజ్ మీరు ఎవరూ రాయవద్దు అంటూ ప్రాధేయపడినట్టు తెలిసింది. దీనిని బట్టి కచ్చితంగా గెడ్డ స్థలం ఆక్రమణకు గురయిందని స్థానికులు అంటున్నారు. సర్వే చేయించి నిజాలు బయట పెట్టాలని కోరుతున్నారు.

రామయ్య సన్నిధిలో బ్రహ్మోత్సవ సంరంభం

- అంబికాబాగ్ రామాలయంలో వేడుకలు ప్రారంభం
- నేడు సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం
- ఇసుక కొండ, పోర్టు వెంకన్న ఆలయాల్లోనూ పరిణయ సంబరాలు


అంబికాబాగ్ రామాలయంలో కొలువుదీరిన సీతారామచంద్రస్వామి


ఇసుకకొండపై కొలువుదీరిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి

డాబాగార్డెన్స్: రామయ్య సన్నిధి బ్రహ్మోత్సవాల సంరంభంతో కళకళలాడుతోంది. కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 6.30 గంటలకు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్టాపన, విశేష హోమాలు, ధ్వజారోహణతో వైఖానస సంప్రదాయాన్ని అనుసరించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు స్వామి కల్యాణ మహోత్సవం

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 10.30 గంటలకు స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిపించనున్నారు. సాయంత్రం విశేష హోమాలు చేపట్టనున్నారు. స్వామి కల్యాణంలో పాల్గొనదలచే భక్తులు రూ.300 చెల్లించాలి.

సత్యదేవుని ఆలయంలో దివ్య కల్యాణం నేడు

ఇసుకకొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో వార్షిక దివ్య కల్యాణోత్సవాలు సోమవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, అంకురార్పణ, వాస్తు యోగీశ్వర మండలారాధన, అగ్ని ప్రతిష్టాపన హోమాలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వెన్నుబోయిన వంశీకృష్ణ శ్రీనివాస్ వార్షికోత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బుద్ధ నాగ జగదీష్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 7 గంటలకు స్వామి దివ్య తిరుకల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. స్వామి కల్యాణం జరిపించుకునే భక్తులు రూ.1,116 రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు 0891–2565090 నంబరులో సంప్రదించవచ్చు.


శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

నేడు పోర్టు వెంకన్న తిరుకల్యాణోత్సవాలు

పోర్టు ఏరియా శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం నిత్య పూజలు, విశేష హోమాలు, ధ్వజారోహణం నిర్వహించనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు కొట్నాల ఉత్సవం, ఎదురు సన్నాహోత్సవం అనంతరం 6.30 గంటలకు స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. స్వామి కల్యాణోత్సవంలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించాలి. మరిన్ని వివరాలకు 79897 09244 నంబరులో సంప్రదించవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.


జలయోగ ఆసనంలో గీతా శ్రీకాంత్

జల'యోగ'ం



బీచ్‌రోడ్డు: ధనురాసనం, శవాసనం, కూర్మాసనం.. ఇవన్నీ యోగాలోని ఆసనాలు. నిత్యం నేలపై చేసే ఈ ఆసనాలను నీటిలో వేశారు శ్రీకాకుళం జిల్లాకు చెందిన యార్లగడ్డ గీత శ్రీకాంత్. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నగరంలోని ఓ హోటల్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో సోమవారం ఆమె వివిధ ఆసనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగ చేయడం వలన మనిషి ఆరోగ్యంగా ఉండటంతో పాటు మనస్సు ప్రశాంతంగా ఉంటుందని అన్నారు. యోగా గొప్పతనం ప్రజలకు తెలిసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు జల యోగా చేస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు.

ఏజెన్సీ టీచర్లను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలని వినతి

కశింకోట: ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రతినిధులతో కలిసి సోమవారం యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్‌లకు అనకాపల్లిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023 జూన్‌లో జరిగిన బదిలీల్లో ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లిన 400 మంది ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలన్నారు. జీవో నెంబర్ 3 రద్దు కావడం, జీవో నెంబర్ 117 అమలు కావడం వల్ల ఉపాధ్యాయులు ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు.

శరవేగంగా 'తండేల్'


లొకేషన్‌లో నటీనటులు సాయి పల్లవి, నాగచైతన్య

కొమ్మాది: గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై చందు మొండేటి దర్శకత్వంలో తండేల్ చిత్ర షూటింగ్ శరవేగంగా సాగుతోంది. సోమవారం నగరంలో మంగమారిపేటబీచ్, ఫిషింగ్ హార్బర్ ప్రాంతాల్లో చిత్ర హీరో అక్కినేని నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవిపై కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. మత్స్యకార బ్యాక్‌గ్రౌండ్‌తో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. అందుకే మత్స్యకార గ్రామాల్లో షూటింగ్ నిర్వహిస్తున్నారు. నాగచైతన్య హీరోగా చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్న మూడో చిత్రమిది. అదే విధంగా సాయి పల్లవి, నాగచైతన్య కలిసి నటిస్తున్న రెండో సినిమా. బన్ని వాసు నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే 75 శాతం సినిమా చిత్రీకరణ పూర్తయిందని చిత్ర యూనిట్ తెలిపింది. సినిమా షూటింగ్ చూసేందుకు ఉప్పాడ, మంగమారిపేట, భీమిలి, రుషికొండ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో అభిమానులు ఇక్కడకు చేరుకున్నారు.

'మాస్టారు' మాస్టారు.. మా మనసులు గెలిచారు

- సాహిత్య,కళారంగంలో రాణిస్తున్న విశ్రాంత ప్రిన్సిపాల్ బాబ్జీ
- కవి, రచయిత, నటుడుగా రాణింపు

మద్దిలపాలెం: వృత్తి రీత్యా అధ్యాపకుడు. తన అభిరుచికి అనుగుణంగా రచనలో రాణిస్తున్నారు. ఓ వైపు పిల్లలకు పాఠాలు చెబుతూ..మరోవైపు రచయితగా ప్రత్యేకతను చాటుకుంటున్నారు. అంతేకాకుండా కళలపై మక్కువతో నటనలోనూ ప్రవేశించి శభాష్ 'మాస్టార్' అనిపించుకుంటున్నారు మిసెస్ మిసెస్ ఏవీఎన్ డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్. రఘుపాత్రుని గణేశ్వర బాబ్జీ. సాహిత్య, కళారంగంలో ఎంతో మంది మనసులను గెలుచుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి బాబ్జీ ప్రస్థానమిది.

ఆమె.. ఓ కథ చిత్రానికి దర్శకత్వం

బాల్య వివాహం.. భర్త అకాల మరణంతో కుంగిపోయి వీధి పోరాటంలో విజయం సాధించి ఎన్నో పురస్కారాలు, బహుమతుల గెలుకుని స్త్రీ అబల కాదు సబలేనని నిరూపించిన చిత్రం ఆమె.. ఓ కథ. ఈ చిత్రానికి బాబ్జీ దర్శకత్వం వహించి సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. ఇదే స్ఫూర్తితో పలు లఘు చిత్రాల్లో నటించి మెప్పించారు.


అక్కినేని నాగేశ్వరరావు, డాక్టర్ సి.నారాయణరెడ్డి చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న బాబ్జీ (ఫైల్)

రచయితగా రాణిస్తూ..

వివిధ సాహిత్య ప్రక్రియలతో రచనలు చేశారు. అవి వివిధ మాస పత్రికలో ప్రచురితమయ్యాయి. సమకాలిన సమాజంలో మార్పులపై తనదైన శైలిలో కవితలను రాశారు.

అవార్డులు..రివార్డులు

మిసెస్ ఏవీఎన్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం పూర్తిగా రచనల్లోనే నిమగ్నమయ్యారు. వివిధ సంస్థల నుంచి సన్మానాలు పొందారు. 2017లో లెజెండ్ ఆఫ్ ఇండియా ఇన్ ఎడ్యుకేషన్ అవార్డు, వీవీఐ ట్రస్ట్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీసెస్ ఎక్సలెన్స్ లెజెండ్ అవార్డును 2022లో అందుకున్నారు. అలాగే మ్యాన్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు 2022లో ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ఆర్టిస్ట్ వారిచే పొందారు. ఎక్సలెన్స్ ఇన్ సోషల్ సరీ్వసెస్ వారి డాక్టర్ అబ్దుల్ కలామ్ ఎక్సలెన్స్ అవార్డును 2023లు తీసుకున్నారు. వీటితో వివిధ రంగాలకు చెందిన 16 అవార్డులు అందుకున్నారు.

కళలు, సాహిత్యం నా శ్వాస



సాహిత్యం, కళారంగం నా శ్వాస..అందులో రాణిస్తూ..పలువుర్ని ప్రోత్సహిస్తున్నాను. సాహిత్యం ఓ పెద్ద సముద్రం..ఎంత చదివినా..ఎంత రాసినా తరగనిది. ఓపిక ఉన్నంతవరకు కళారంగాన్ని..సాహిత్య రంగాన్ని విడిచిపెట్టను. సాహిత్య సంపద భవిష్యత్ తరానికి అందించడమే నా ధ్యేయం.

–డాక్టర్.రఘుపాత్రుని గణేశ్వర బాబ్జీ

పోర్టు ప్రగతి భేష్


పోర్టు చైర్మన్ అంగముత్తుతో మాట్లాడుతున్న జీవీఎల్ నరసింహారావు

మహారాణిపేట: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న 12 ప్రధాన ఓడరేవుల్లో ఒకటైన విశాఖ పోర్టు అథారిటీ అత్యుత్తమ పనితీరును కనబరచడం విశాఖకే గర్వకారణమని బీజేపీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. కీలకమైన పనితీరు ద్వారా గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో గణనీయమైన మెరుగుదలకు కారణమైన పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, తక్కువ కాలంలోనే ఇంతటి అద్భుతమైన పనితీరు కనబరిచిన అధికారులకు అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. సోమవారం పోర్టు చైర్మన్‌తో జీవీఎల్ భేటీ అయ్యారు. తాజా గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో విశాఖ పోర్టు 19,20 స్థానాలు పొందడంపై ఆయన అభినందనలు తెలిపారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.72,330
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.66,300
వెండి(కిలో):	రూ.95,500

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.128
బ్రాయిలర్ (లైవ్)	: రూ.148
స్కిన్	: రూ.266
స్కిన్‌లెస్	: రూ.276

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	530.00
విజయనగరం	534.00
శ్రీకాకుళం	534.00

తీపి ఎక్కువైతే చేదే..

- ఈనెల 12 నుంచి 18 వరకు జాతీయ మధుమేహ వారోత్సవాలు
- పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన



సాక్షి, అనకాపల్లి: తీపి అంటే అందరికీ ఇష్టమే. కానీ ఆ తీపి శరీరంలో ఎక్కువైతే జీవితం చేదుగా మారుతుంది. మధుమేహ వ్యాధి అనేది మనిషిని తీవ్రమైన మానసిక ఆందోళనకు గురిచేస్తుంది. మధుమేహం ఒకప్పుడు పెద్దలకు మాత్రమే వచ్చేది. కానీ ప్రస్తుతం చిన్నా.. పెద్దా అనే తేడా లేకుండా అందరిలో ఈ సమస్య కనిపిస్తోంది. నిండా 30 ఏళ్లు నిండకపోయినా మధుమేహ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో కూడా మధుమేహ వ్యాధిగ్రస్తులు పెరుగుతూనే ఉన్నారు. గత ప్రభుత్వంలో ఫ్యామిలీ ఫిజీషియన్, జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి హెల్త్ డ్రైవ్‌ల ద్వారా గ్రామాల్లో మధుమేహ రోగులకు వైద్యసేవలు, మందులు అందిస్తూ వ్యాధి నియంత్రణలో ఉండేలా కృషి చేశారు. జిల్లాలో ఈనెల 12వ తేదీ నుంచి 18 తేదీ వరకు జాతీయ మధుమేహ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. పీహెచ్‌సీ వైద్యులు గ్రామాల్లో మధుమేహ రోగులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్న మధుమేహ వ్యాధిగ్రస్తులు 1.5 లక్షల మేర ఉన్నట్టు అంచనా. ఇందులో 90 శాతం మేరకు టైప్–2 రకం మధుమేహం రోగులే ఉన్నారు. వీరిలో 90 వేల మంది రోగులకు ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా మధుమేహ పరీక్షలు చేసి మందులు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుత కాలంలో డయాబెటిస్ సమస్య అందరిలోనూ కనిపిస్తోందని, రోజువారీ జీవనశైలి, ఆహారనియమాలు పాటించడం ద్వారా ఈ వ్యాధిని నియంత్రణలో పెట్టవచ్చని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి వైద్యుడు ఎస్.మల్లికార్జున చెప్పారు. ఆకుపచ్చ, ఆకుకూరలు మధుమేహ రోగులకు ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. తృణధాన్యాలు, బ్రౌన్ రైస్, తాజా కూరగాయలు, తాజా పండ్లు, బీన్స్ తింటే మంచిదన్నారు. దాల్చిన చెక్క, సొరకాయ, కాకరకాయ, మెంతులు, ఆకుకూరలు, జొన్నలు, రాగులు వంటి చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా డయాబెటిక్స్‌ను అదుపులో ఉంచుకోవచ్చన్నారు.

హోం మంత్రికి వివిధ సంఘాల వినతులు

మహారాణిపేట: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను ఏపీ గెజిటెడ్ అధికారులు సంఘం, ఏపీ జేఏసీ(అమరావతి), రెవెన్యూ అసోసియేషన్ సంఘాల నేతలు వేర్వేరుగా సర్క్యూట్ హౌస్‌లో కలిశారు. వారి వారి సమస్యలను వినతి రూపంలో మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో ఏపీ గెజిటెడ్ అధికారులు సంఘం అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి, జిల్లా అధ్యక్షుడు యజిల విజయకుమార్, రెసిడెన్షియల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ నిర్మల, డుమా పీడీ సందీప్, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, ఇరిగేషన్ డీఈఈ ఎం.రాజేంద్ర, ఎక్సైజ్ సీఐ వై.రాజు, పాలిటెక్నిక్ లెక్చరర్ రమణ, తహసీల్దార్ అంబేద్కర్, ఏపీ జేఏసీ అమరావతి విశాఖ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వర రెడ్డి, రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎ. త్రినాథరావు, జేఏసీ ఉమెన్‌వింగ్ చైర్‌పర్సన్ శైలజా పాణి గ్రాహి, ఆర్టీసీ ఉద్యోగుల అధ్యక్షులు కె.ఎస్.ఎస్.మూర్తి, మున్సిపల్ టీచర్ల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి సిద్ధార్థ, ఫిజికల్లీ చాలెంజెడ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. శ్రీనివాస్, మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, ప్రభుత్వ నాల్గో తరగతి ఉద్యోగుల తరుపున శంకర్, రెవెన్యూ సంఘ నాయకులు యోగి, మణికంఠ, సుభద్ర పాల్గొన్నారు.


మంత్రి అనితను అభినందిస్తున్న ఏపీ గెజిటెడ్ అధికారులు సంఘం నాయకులు

ముదముతో కొలిచేము మోదకొండమ్మా..



మాడుగుల: మన్యం దేవత, ఈ ప్రాంత ఇలవేల్పు, మాడుగుల మోదకొండమ్మ జాతర మంగళవారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. అమ్మవారి పండగను ఏటా అత్యంత వైభవంగా నిర్వహించడం పరిపాటి. భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ఏడాది కూడా భారీగా భక్తులు వచ్చే అవకాశాలుండటంతో జాతరను ఘనంగా నిర్వహించేందుకు కమిటీ ప్రతినిధులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పించారు. గ్రామం, పట్టణ పరిధిలో వీధుల్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి ఆలయం నుంచి సతకంపట్టు వరకు, చోడవరం రోడ్డులో వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు, మోదమాంబ కాలనీ దాసరి వీధి, జగ్గన్నచావిడి, పురవీధుల్లో భారీ విద్యుత్ దీపాలంకరణ, సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో భారీ విద్యుత్ కటౌట్లు పెట్టారు. జాతర సందర్భంగా ఆర్టీసీ యంత్రాంగం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.

సాంస్కృతిక కార్యక్రమాలు

జాతర సందర్భంగా వేర్వేరు చోట్ల పలు సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. సతకంపట్టు వద్ద డ్యాన్స్ హంగామా, ఎన్టీఆర్ స్టేజ్ దుర్గాలమ్మ ఆలయం వద్ద జబర్దస్త్ కళాకారులు, జీఆర్ ఈవెంట్స్ సారథ్యంలో డ్యాన్స్–2024, దసరా స్టేజీ మీద వీరాభిమన్యు బుర్రకథ, భక్త చింతామణి పౌరాణిక నాటకం, శ్రీ కృష్ణ రాయబారం పద్య నాటకం, జగ్గన్న చావిడి వద్ద డ్యాన్స్ బేబీ డ్యాన్స్ నిర్వహించనున్నారు. గవరవీధి, నెయ్యిలవీధి, అంబేద్కర్ కాలనీ సమీపంలో డ్యాన్స్ మస్తీ, జవ్వాది గెడ్డ దేవరాపల్లి శ్రీను ఇంటి వద్ద సినీ నృత్య ప్రదర్శన, రావిచెట్టు జంక్షన్ వద్ద డ్యాన్స్ ఉత్సవ్, ఎంపీడీవో కార్యాలయం వద్ద సూపర్ డూపర్ డ్యాన్స్, సతకంపట్టు వద్ద ప్రాచీన కళ తోలుబొమ్మలాటలు ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు గరగల నృత్యం, బిందెల డ్యాన్స్ తదితర సంప్రదాయ కార్యక్రమాలు జరగనున్నాయి. దాతల సహకారంతో ప్రసాద వితరణ, మజ్జిగ, గ్లూకోజ్ వాటర్ పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశారు.

మహిళ ఆత్మహత్య


కొప్పల స్వాతి (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: జీవితంపై విరక్తితో వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్కాపురం దరి కాకరలోవ జై ఆంధ్రకాలనీకి చెందిన దండు భాను కుమార్తె స్వాతి (23)కి ఏడేళ్ల క్రితం వేపగుంట వద్ద గల చీమలాపల్లికి చెందిన కొప్పల దేవేంద్ర కుమార్‌తో ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఒక పాప ఉంది. కొన్నాళ్ల తర్వాత మనస్పర్థల కారణంగా వారు దూరంగా ఉంటున్నారు. స్వాతి నాలుగేళ్లగా తల్లి వద్దనే ఉంటూ గాజువాకలోని ఓ షాపింగ్‌మాల్‌లో పనిచేస్తోంది. ఈ క్రమంలో మల్కాపురానికి చెందిన రోహిత్ కుమార్‌తో సన్నిహితంగా ఉండేది. కొద్ది రోజులుగా గాజువాకలోని ఓ లేడీస్ హాస్టల్‌లో ఉంటోంది. స్వాతి కుమార్తె మల్కాపురంలో ఆమె తల్లి వద్ద ఉంటుంది. రెండు నెలల క్రితం స్వాతి భర్త దేవేంద్ర కుమార్ అత్త వద్దకు వచ్చి తన కుమార్తెను తీసుకెళ్లి రెండు రోజుల్లో తీసుకొస్తానని చెప్పి తిరిగి తీసుకురాలేదు. దీంతో స్వాతి తన కూతురుతో పాటు రోహిత్ కూడా దూరం కావడంతో జీవితంపై విరక్తి చెంది హాస్టల్‌లో ఆదివారం అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన హాస్టల్ వార్డెన్ గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి తల్లి దండు భాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఏఎస్ఐ రవికుమార్ తెలిపారు.

'డాక్‌పే' జిందాబాద్

- డిజిటల్ లావాదేవీలు పెంచే దిశగా యాప్
- తపాలా శాఖ ముందంజ
- ప్రజలకు చేరువగా సేవలు
- గూగుల్ పే, ఫోన్‌పేలకు దీటుగా రూపకల్పన



దాబాగార్డెన్స్: దేశంలో డిజిటల్ లావాదేవీలను పెంచే దిశగా తపాలాశాఖ వినియోగదారులకు పలు రకాల సేవలను అందించడంలో ఆసక్తి చూపుతోంది. ఉత్తరాలు, మనీ ఆర్డర్లు, కొరియర్, స్పీడ్ పోస్ట్ తోపాటు ప్రైవేటు సంస్థలకు దీటుగా హ్యాంకింగ్, గోల్డ్ బాండ్, బీమా తదితర సేవలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది. మరో అడుగు ముందుకేసి డిజిటల్ లావాదేవీల పెంపునకు గూగుల్ పే, ఫోన్ పే మాదిరిగా డాక్ పే అనే యాప్‌ను 2021లోనే దేశ వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పుడు దీన్ని ప్రజలకు చేరువ చేసే దిశగా దూసుకెళుతోంది. ఈ డాక్ పే ద్వారా ప్రజలు డిజిటల్ ఫైనాన్స్ సేవలు పొందడంతోపాటు ఇండియా పోస్టు, ఐపీపీబీ, అందించే బ్యాంకింగ్ సేవల విషయమై సాయం పొందవచ్చు. డబ్బు పంపడం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం, డిజిటల్ రూపంలో వ్యాపారులకు నగదు చెల్లించడం లాంటి పనులను చక్కబెట్టుకోవచ్చు. ప్రతి భారతీయుడి అవసరాలను తీర్చేలా డాక్ పేను రూపొందించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో యూపీఐ డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే దిశగా దీనిని ఎప్పటికప్పుడు ఆధునికీకరిస్తున్నారు. ఈ యాప్‌ను ఏ బ్యాంకు ఖాతాదారుడైనా వినియోగించవచ్చు. గ్రీవెన్స్ వెసులుబాటు గూగుల్ పే, ఫోన్ పే నగదు లావాదేవీల్లో ఏవైనా పొరపాట్లు చోటుచేసుకుంటే ఫిర్యాదులు చేసేందుకు అవకాశం ఉండదు. ఎందుకంటే వాటి కార్యాలయాలు మనకు అందుబాటులో ఉండవు. అయితే డాక్‌పే యాప్ ద్వారా నగదు బదిలీ సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే ఫిర్యాదుల స్వీకరణకు తపాలా శాఖ వెసులుబాటు కల్పించింది. డాక్ పే అనే యాప్‌తపాలాశాఖ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే పనిచేస్తుండడంతో మన డబ్బుకు గ్యారెంటీ ఉంటుంది. యాప్ గురించిన సమగ్ర సమాచారం కోసంఐ పీపీబీ టోల్‌ఫ్రీ నంబర్ 155299ను వినియోగదారులు సంప్రదించొచ్చని తపాలా శాఖా అధికారులు చెబుతున్నారు.

రైలు ప్రయాణికులకు భరోసా 'రైల్ మదద్'

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల విషయంలో జవాబుదారీతనంగా వ్యవహరించేందుకు రైల్వే శాఖ వినూత్న కార్యక్రమాలను చేపడుతోంది. ఇప్పటికే వారి భద్రతకు సంబంధించి వివిధ రకాల సేవల నిమిత్తం టోల్‌ఫ్రీ సంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. రైల్లో ప్రయాణించే వారికి ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే ఫిర్యాదు చేసేందుకు వీలుగా రైల్ మదద్ యాప్ ను ప్రవేశపెట్టింది.స్టేషన్లలో అపరిశుభ్రత, రైల్లో భద్రత, సిబ్బంది నిర్లక్ష్యం, అవినీతి ఇలా 85 రకాల సమస్యలపై యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. దీంతో ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరిస్తారు. ఈ యాప్‌లో ఫిర్యాదు చేసే ప్రయాణికులు రిజర్వేషన్, జనరల్, ప్లాట్‌ఫారం టికెట్లలో ఏదో ఒకటి తప్పనిసరిగా కలిగి ఉండాలి.



వేటిపై ఫిర్యాదు చేయవచ్చంటే...

రైల్వేస్టేషన్స్‌లో అపరిశుభ్ర వాతావరణం, నీటి కొరత, వెయిటింగ్ హాల్లో కనీస సౌకర్యాలు కరువు, రిజర్వేషన్ చేసినా వెయిటింగ్ జాబితాలో ఉండడం, టీటీఈ, ఇతర సిబ్బంది అవినీతి, రైలు సిబ్బంది నిర్లక్ష్యం, దురుసు ప్రవర్తన, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, వస్తువుల అపహరణ, గొలుసు దొంగతనాలు, కొట్లాటలు పొగ మద్యసేవనం, గొడవలు, మహిళలపట్ల అసభ్యకర ప్రవర్తన, ఆకతాయిల వేధింపులు, మరుగుదొడ్లు, బోగీల్లో అపరిశుభ్ర త, నాణ్యత లేనిఆహారం, ప్యాంటి కార్‌లో అపరిశుభ్రత, అధిక ధరలకు తినుబండారాలు అమ్మడం, ఏసీ, ఫ్యాన్లు, లైట్లు,చార్జింగ్ పాయింట్‌లు పనిచేయకపోవడం, బెడ్‌రోల్స్ అపరిశుభ్రంగా ఉండడం, రైళ్ల రాకపోకల్లో ఆలస్యం తదితర సమస్యలపై యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

నిరంతర పర్యవేక్షణ

రైల్ మదద్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై రైల్వే జనరల్ మేనేజర్, డివిజనల్ మేనేజర్‌లు నేరుగా పర్యవేక్షిస్తారు. ఫిర్యాదు స్థాయిని బట్టి సంబంధిత విభాగానికి చెందిన అధికారికి పంపి సమస్యను పరిష్కరించాలని ఆదేశిస్తారు. వారు సమస్యను పరిష్కరించి అందుకు సంబంధించిన వివరాలను ఫిర్యాదుదారుని సెల్‌ఫోన్‌కు మెసేజ్ రూపంలో పంపుతారు. ఈ యాప్ ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైల్వే అధికారులు సూచిస్తున్నారు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

ప్లేస్టోర్‌లోకి వెళ్లి రైల్ మదద్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. వ్యక్తిగత వివరాలు, సెల్‌ఫోన్, ఈ–మెయిల్ తదితర వివరాలను నమోదు చేయాలి. సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీని నమోదు చేయడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ యాప్ ద్వారా ప్రయాణికుడు రైల్లో, స్టేషన్లలో వివిధ సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చు. ఆధారాల కోసం యాప్ ద్వారా ఫొటోలను సైతం అప్‌లోడ్ చేయాలి. సంబంధిత అధికారులకు సూచనలు, సలహాలు సైతం ఇవ్వొచ్చు. ప్రతి ఫిర్యాదుకు రిఫరెన్స్ నంబర్ ఉంటుంది. దాంతో ఫిర్యాదు స్టేటస్ తెలుసు కోవచ్చు. సమస్య పరిష్కారంకాగానే ఫిర్యాదుదారుకి ఎస్ఎంఎస్, ఈ–మెయిల్ వస్తుంది.

కమనీయం.. శ్రీనివాస కల్యాణం


వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

కశింకోట : స్థాని వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో సోమవారం రాత్రి శ్రీవారి వార్షిక కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జేష్ఠ శుద్ధ ఏకాదశి పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించిన వేదికపై నిలిపి శాస్త్రోక్తంగా వేదమంత్రాల నడుమ సామూహికంగా దంపతులు కల్యాణాన్ని జరిపించారు. శుభ ముహూర్తాన జీలకర్ర, బెల్లం, మాంగల్య ధారణతో కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు.